క్లుప్తంగా

విద్యార్థులకు పలకల పంపిణీ



పెబ్బేరు రూరల్: బడిబాట కార్యక్రమంలో భాగంగా శ్రీరంగాపురం మండలంలోని నాగరాల 2, 3వ సెంటర్లలో దాత నరేందర్‌రెడ్డి సహకారంతో ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు పలకలు, బలపాలు అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రాజేంద్రప్రసాద్‌యాదవ్, ఎంఈఓ జయరాములు, హెచ్‌ఎం, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాములుయాదవ్, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీహరిరాజు, తిరుపతిరెడ్డి, సత్యనారాయణరెడ్డి, రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.

చెత్త సేకరణ పన్ను ఎత్తివేయాలి



పెబ్బేరు రూరల్: ప్రజలపై అధిక భారం వేసిన మున్సిపాలిటీ, చెత్త సేకరణ పన్నును తక్షణమే ఎత్తివేసి, గతంలో విధంగా చెత్తను సేకరించాలని వనపర్తి జిల్లా అఖిలపక్ష ఐక్యవేదిక అధ్యక్షుడు సతీష్‌యాదవ్, గోపాలకృష్ణ డిమాండ్ చేశారు. మంగళవారం వనపర్తి పట్టణ కేంద్రంలో వారు మాట్లాడుతూ చట్టంలో లేని వ్యవస్థను ప్రజలపై రుద్దడం నేరమని, ప్రజలు కట్టే ఇంటి పన్నులోనే ఇవి అంతర్భాగంగా ఉంటాయన్నారు. వనపర్తి మున్సిపాలిటీలో కొత్తగా చెత్త పన్ను వేయడం దారుణమని, ప్రజల మీద భారం తొలగించాలని కోరారు. కార్యక్రమంలో రమేష్, సతీష్, ఆంజనేయులు, శివ తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో శారీరక, మానసిక ధృడత్వం



పెబ్బేరు రూరల్: పట్టణ కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం విష్ణువర్ధన్‌రావు ఆధ్వర్యంలో సుస్థిర ఆహారపు అలవాట్లు అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ విద్యార్థులు జంక్ ఫుడ్‌కు దూరంగా ఉండాలని, ఇంట్లో వండిన పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. సుస్థిర ఆహారపు అలవాట్లతో మంచి సమాజం నిర్మితమవుతుందని వారు వివరించారు. కూరగాయలు, ఆకుకూరలతో పాటు పాలు, గుడ్లు ఆహారంలో తీసుకోవడం ద్వారా శారీరక, మానసిక ధృడత్వం ఏర్పడుతుందన్నారు. వనరులను అవసరం మేరకు వినియోగించు కోవాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్‌జీసీ పాఠశాల కోఆర్డినేటర్ కృష్ణయ్య, ఉపాధ్యాయులు శ్రీవిద్య, పుష్పకుమారి, శ్రీనివాస్‌గౌడ్, నాగేంద్రం తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

కొల్లాపూర్ రూరల్: ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని బాలల సంక్షేమ సమితి సభ్యుడు జంగిడి విష్ణు అన్నారు. మంగళవారం మండలంలోని మొలచింతలపల్లిలో బాలల సంక్షేమ సమితి ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంటల తరబడి మొబైల్ వినియోగం వల్ల కలిగే నష్టాలను వివరించారు. కొందరు లైంగిక మోసాలకు పాల్పడే అవకాశం ఉందన్నారు. సోషల్‌మీడియా ద్వారా పరిచయం అవుతున్న కొత్త వ్యక్తులను నమ్మొద్దన్నారు. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రాం వంటి సోషల్ మీడియాకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో తిరుపాలు, మాజీ సర్పంచ్ రాజు, ఉప సర్పంచ్ కొమ్ము వెంకటస్వామి, శ్రీనివాసులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

వర్షం కోసం ఎదురుచూపులు

పెద్దకొత్తపల్లి: ఇటీవల కురిసిన వర్షాలకు వానాకాలం పంటగా మొక్కజొన్న విత్తనాలు వేసిన రైతులు వర్షం కోసం ఎదురు చూస్తున్నారు. మండలంలో దాదాపు 5 వేల ఎకరాలలో మొక్కజొన్న విత్తనాలను రైతులు విత్తుకున్నారు. స్ప్రింక్లర్‌ల ద్వార నీటి తడిని ఇస్తున్నారు. నీటి వసతి లేని రైతులంతా వరుడి కోసం ఎదురుచూస్తున్నారు. మండల కేంద్రంతోపాటు దేవల్‌తిరుమలాపూర్, వెనచర్ల, నక్కలపల్లి, చంద్రకల్, ముష్టిపల్లి, మర్రికల్, పెద్దకార్పాముల, నాయనోనిపల్లి, యాపట్ల, మారేడు మాందిన్నె గ్రామాల రైతులు వర్షం ఆశగా ఎదురుచూస్తున్నారు.



‘భగీరథ’పై ఇంటింటి సర్వే



పాన్‌గల్ మండలం గోప్లాపూర్‌తండాలో మిషన్ భగీరథ పైప్‌లైన్ లీకేజీ

- ప్రత్యేకాధికారుల నియామకం
- ప్రతి ఇంటికి నీటి సరఫరా, నల్లాల వివరాలపై ఆరా
- ఈనెల 20తో ముగియనున్న సర్వే

పాన్‌గల్: రాష్ట్ర ప్రభుత్వం మిషన్ భగీరథ పథకంపై సమగ్ర సర్వే నిర్వహిస్తుంది. గత ప్రభుత్వం ప్రారంభించిన ఈ పథకం అమల్లోకి వచ్చి ఆయిదేళ్లు అవుతున్నా గ్రామీణ ప్రాంతాల్లో పూర్తి స్థాయిలో పైపులైన్లు, నల్లా కనెక్షన్లు ఇవ్వలేదని, తాగునీటి సమస్యలు ఇంకా ఉన్నాయనే భావనలో ఉంది. బీఆర్‌ఎస్ ప్రభుత్వం వందశాతం ఇంటింటికీ తాగునీరు సరఫరా అవుతుందని ప్రకటించడంతో కేంద్రం నుంచి తాగునీటి అవసరాలకు జల్ జీవన్ మిషన్ పథకం కింద నిధులు రావడంలేదు. ఈ నేపథ్యంలో తాగునీటి సమస్యలపై కేంద్రానికి ప్రతిపాదనలు పంపితే జల్ జీవన్ మిషన్ కింద నిధులు మంజూరవుతాయని ప్రభుత్వం యోచిస్తోంది. ఈ నేపథ్యంలో పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో ఎంపీడీఓలు, ఏపీఓలు, ఏపీఎంలు, టెక్నికల్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు, ఐకేపీ సీసీలు సర్వే చేస్తున్నారు. మిషన్ భగీరథ పథకానికి చెందిన ఉద్యోగులు, సిబ్బందిని దూరంగా ఉంచారు.

మండలంలో..

28 గ్రామ పంచాయతీల్లో 10,850 నివాస గృహాలకు తాగునీరు సరఫరా చేస్తున్నట్లు నివేదికలు చెబుతున్నాయి. ప్రతి వ్యక్తికి రోజుకు 100 లీటర్ల చొప్పున శుద్ధ నీటిని సరఫరా చేస్తున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. అయితే గ్రామీణ ప్రాంతాల్లో పథకం అమలు తీరు సరిగా లేదని, సరిపడా నీరు రావడంలేదని స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు వాపోతున్నారు. కొత్తగా ఇళ్లు నిర్మించుకున్న వారికి కనెక్షన్లు ఇవ్వడం లేదనే విమర్శలున్నాయి. మండలంలో ఈనెల 10 నుంచి ప్రారంభమైన ఇంటింటి సర్వే 20వ తేదీతో ముగిస్తుందని, ఇప్పటికి ఆయా మండలాల్లో 80 శాతానికి పైగా సర్వే పూర్తైనట్లు అధికారులు పేర్కొన్నారు.



చింతకుంటలో ఇంటింటి సర్వేను పరిశీలిస్తున్న మండల ప్రత్యేకాధికారి స్వరణ్‌సింగ్ (ఫైల్)

వివరాలు..

మండలం	జీపీలు	నివాస గృహాలు	సర్వే సిబ్బంది
పాన్‌గల్	28	10,850	56
చిన్నంబావి	17	6,724	25
వీపనగండ్ల	14	6,400	36

నిబంధనలకు పాతర



మిషన్ భగీరథ పథకం ద్వారా ప్రతి మనిషికి రోజుకు 100 లీటర్లు సరఫరా చేయాలనే నిబంధన ఉన్నా అమలు కావడం లేదు. ఇంటింటికీ నల్లాలు ఏర్పాటు చేసినా తగినంత నీరు రావడం లేదు. భగీరథ పథకం అమలు అవుతున్నా ఇంకా బోరు నీటిపైనే ఆధారపడాల్సి వస్తోంది. గ్రామాలకు ప్రత్యేకమైన మిషన్ భగీరథ పైపులైన్ లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

– కళావతమ్మ, కేతేపల్లి

అధికారుల పర్యవేక్షణ లేదు



మిషన్ భగీరథ నీటి సరఫరాపై అధికారుల పర్యవేక్షణ లేదు. ముఖ్యంగా తండాల్లో పైపులైన్లు అస్తవ్యస్తంగా ఉండటంతో పాటు నల్లాలు బిగించలేదు. పైప్ లైన్ లీకేజీలపై ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకునే నాథుడే లేడు. దీంతో నీటి సరఫరా సక్రమంగా సాగటం లేదు.

– బాల్యానాయక్, తెల్లరాళ్లపల్లితండా

ప్రతి సమస్యను గుర్తిస్తాం



మిషన్ భగీరథ నీటి సరఫరాపై నిర్వహిస్తున్న ఇంటింటి సర్వేలో ప్రతి సమస్యను గుర్తించి, యాప్‌లో పొందుపరుస్తాం. మండలంలో ఇప్పటికి 80 శాతానికి పైగా సర్వే పూర్తైంది. ఈనెల 20 వరకు పూర్తి చేయాలని ప్రభుత్వం సూచించింది. సర్వే పూర్తయిన వెంటనే గ్రామాల్లో ఉన్న తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి చేస్తాం.

– కోటేశ్వర్, ఎంపీడీఓ, పాన్‌గల్

సమస్యలు పరిష్కరించడంలో విఫలం



ధర్నా చేస్తున్న నాయకులు

అమరచింత: పట్టణంలోని సమస్యలను పరిష్కరించడంలో మున్సిపల్ అధికారులు, పాలకవర్గం విఫలమైందని ప్రజాపంథా మాస్‌లైన్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా చేపట్టారు. ఈసందర్భంగా ఆ పార్టీ నాయకులు రాజన్న, ప్రసాద్ మాట్లాడుతూ పాలకవర్గం ఏర్పడి నాలుగేళ్లు అవుతున్నా ఇప్పటి వరకు పూర్తి స్థాయిలో మురుగు కాల్వలను నిర్మించలేకపోయారన్నారు. అంతర్గత రహదారులను సీసీగా మార్చుతామని చెప్పినా.. నేటికీ వీధుల్లో గతుకుల రోడ్లే దర్శనమిస్తున్న పాలకులు చోద్యం చూస్తున్నారని ధ్వజమెత్తారు. తహసీల్దార్ కార్యాలయం వెనక నుంచి పాల్ మెమోరియల్ స్కూల్ వరకు ఉన్న చెరువు కాల్వను అండర్ డ్రెయినేజీగా మార్చాలని ఏళ్ల తరబడి కాలనీ ప్రజలు వినతులు ఇస్తున్నా మున్సిపల్ చైర్‌పర్సన్ పట్టించుకోకపోవడంపై మండిపడ్డారు. పట్టణాభివృద్ధి కోసం మంజూరైన నిధులతో పాటు నర్సరీ మొక్కల పెంపకం, హరితహారంలో అధికంగా అవినీతికి పాల్పడిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వార్డుల్లో మహిళల అవసరాల కోసం సామూహిక మరుగుదొడ్లను వెంటనే నిర్మించాలని కోరారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని మున్సిపల్ కమిషనర్ నదీంకు అందించారు. కార్యక్రమంలో కురుమన్న, సామేలు, మసలమణి, రాంచందర్, జిలాని, అబ్రహం, భక్తి తదితరులు పాల్గొన్నారు.

‘నీట్’ లీకేజీకి ప్రధానిదే బాధ్యత



నిరసన తెలుపుతున్న నాయకులు

పెబ్బేరు రూరల్: బీజేపీ పాలిత రాష్ట్రాల్లోనే నీట్ పరీక్ష పేపర్ లీకేజీ జరిగిందని, అందుకు ప్రధాన మంత్రి నరేంద్రమోదీ బాధ్యత వహించాలని ఏఐఎస్‌ఎఫ్, ఏఐవైఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు నీట్ పరీక్ష రద్దు చేయాలని మంగళవారం ఆంబేడ్కర్ చౌరస్తాలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా, పేపర్ లీకేజీ బాధ్యులను కఠినంగా శిక్షించాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. నీట్ పరీక్షను రద్దు చేసి వీలైనంత త్వరగా మళ్లీ పరీక్షలు నిర్వహించాలన్నారు. విద్యార్థులకు న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ డివిజన్ కార్యదర్శి వంశీ, రమేష్, గోపాలకృష్ణ, శ్రీరామ్, మహేష్, చంద్రశేఖర్, మోహన్, రాము, అశోక్ పాల్గొన్నారు.

‘మా జాగా మాకు కావాలె’



నిరసన వ్యక్తం చేస్తున్న గీత కార్మికులు

అమరచింత: పట్టణానికి చెందిన బీఆర్‌ఎస్ పార్టీ నాయకుడు గౌడలకు చెందిన దుకాణ స్థలాన్ని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్నాడని, తమకు న్యాయం చేయాలని మంగళవారం గౌడులు అదే స్థలం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా అమరచింత గీత కార్మిక పారిశ్రామిక సంఘం నాయకులు లచ్చన్న గౌడ్, అశోక్‌గౌడ్ మాట్లాడుతూ గ్రామంలో గీత కార్మికులు కల్లు విక్రయించేందుకు పాత కూరగాయల మార్కెట్‌లో స్థలాన్ని సొసైటీ ద్వారా కొనుగోలు చేశారని తెలిపారు. అక్కడే కల్లు విక్రయాలను కొనసాగిస్తు వచ్చారు. గ్రామం విస్తరించడంతో కల్లు దుకాణాన్ని బీసీ కాలనీలోకి మార్చేందుకు అక్కడి నుంచి కల్లుపాకను తీసేశామన్నారు. దీన్ని ఆసరాగా తీసుకున్న బీఆర్‌ఎస్ పార్టీ మండల నాయకుడు నాగభూషణంగౌడ్ ఉండ్యాలకు చెందిన బలరాంగౌడ్ పేరును వినియోగించుకుంటూ ఆయన తండ్రి పేరు సైతం బలరాం గౌడ్ ఉండటంతో అప్పట్లో గ్రామ పంచాయతీకి కట్టిన ట్యాక్స్‌లను చూపించి స్థలాన్ని అతడి పేరుపై రాసుకున్నాడని ఆరోపించారు.

87 కుటుంబాలకు ఆధారం

అమరచింత గీత పారిశ్రామిక సహకార సంఘంలో 87 కుటుంబాలు కల్లుపైనే ఆధారపడి జీవిస్తున్నాయన్నారు. సొసైటీకి చెందిన స్థలాన్ని అక్రమంగా కాజేయాలని యత్నించిన నాగభూషణంగౌడ్‌పై చర్యలు తీసుకుని తమ స్థలాన్ని సొసైటీకి దక్కేలా చొరవ చూపాలని కోరుతున్నారు. అక్రమ రిజిస్ట్రేషన్ వ్యవహారంపై అధికారులకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో శ్రీలన్‌గౌడ్, నరసింహులుగౌడ్, ఊషన్నగౌడ్, కృష్ణయ్య గౌడ్, గిరినాథంగౌడ్, రాజుగౌడ్, అంజిగౌడ్, కేశవులు గౌడ్, పురుషోత్తం గౌడ్, రామన్‌గౌడ్ ఉన్నారు.

కొత్త చట్టాలపై అవగాహన తప్పనిసరి



మాట్లాడుతున్న సీఐ రాంబాబు

కొత్తకోట రూరల్: భారత ప్రభుత్వం జులై 1 నుంచి తీసుకొస్తున్న కొత్త చట్టాలపై ప్రతి పోలీస్ సిబ్బంది అవగాహన కలిగి ఉండాలని కొత్తకోట సీఐ రాంబాబు అన్నారు. మంగళవారం కొత్తకోట సర్కిల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కొత్తకోట, పెద్దమందడి, ఖిల్లాఘణపురం, పెబ్బేరు, శ్రీరంగాపూర్ పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న 30మంది సిబ్బందికి పట్టణ కేంద్రంలోని నివేదిక కళాశాలలో మూడు రోజుల పాటు శిక్షణ తరగతులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కొత్తకోట సీఐ రాంబాబు మాట్లాడుతూ భారత ప్రభుత్వం నూతనంగా తీసుకొచ్చిన భారతీయ న్యాయ సన్హిహిత (బీఎన్‌ఎస్), భారతీయ నాగరిక సురక్ష సన్హిహిత (బీఎన్‌ఎస్‌ఎస్) చట్టాలపై హైదరాబాద్ పోలీస్ అకాడమీలో కొత్త చట్టాలపై శిక్షణ పొందిన శిక్షకులు ఎస్‌ఐ వెంకటస్వామి, ఎస్‌ఐ అంజాద్‌పాషా శిక్షణ ఇస్తున్నారని, సిబ్బంది శ్రద్ధగా విని చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. జులై 1 నుంచి దేశవ్యాప్తంగా కొత్త చట్టాలను అమలు చేస్తూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని, కొత్త చట్టాలను అనుసరిస్తూ ముందుకు సాగాలన్నారు. నూతన చట్టాల ద్వారా కేసుల దర్యాప్తు, విధానాలు, విచారణ పద్ధతుల్లో మార్పు వస్తుందన్నారు. కార్యక్రమంలో కొత్తకోట ఎస్‌ఐ మంజునాథ్‌రెడ్డి, ఏఎస్‌ఐలు, హెడ్ కానిస్టేబుల్స్, రైటర్లు తదితరులు ఉన్నారు.

బస్టాండ్‌లో మౌలిక వసతులు కల్పించాలి



డిపో అధికారికి వినతి పత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

వనపర్తి టౌన్: వనపర్తి ఆర్టీసీ బస్టాండ్‌లో వసతులు కరువయ్యాయని, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతో రద్దీ అధికమయ్యి మహిళలు కనీసం కూర్చోవడానికి కుర్చీలు లేవని బీజేపీ పట్టణ అధ్యక్షుడు బచ్చు రాము ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అనే హామీతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం బస్టాండులో కనీస వసతులను కల్పించడంలో విఫలమైందని ఆరోపించారు. ఈ మేరకు మంగళవారం డిపో అధికారికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళలకు మూత్రశాలలు, తాగునీటి వసతి లేక ఇబ్బందులు పడుతున్నారని గుర్తుచేశారు. ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా అన్ని మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి రామన్‌గౌడ్, అసెంబ్లీ కన్వీనర్ శ్రీనివాస్‌గౌడ్, పట్టణ ఉపాధ్యక్షుడు కుమారస్వామి, అధికార ప్రతినిధి పెద్దిరాజు, నాయకులు రాయన్నసాగర్, విజయ్‌కుమార్ సాగర్, రాము, గోవిందు, అనిల్‌కుమార్ గౌడ్, జ్ఞానేశ్వర్, శివ, ప్రకాష్‌చారి, రవి, శంకర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

మోటూరు హనుమంతురావుకు నివాళి



హనుమంతరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకుల

పెబ్బేరు రూరల్: మోటూరు హనుమంతురావు 23వ వర్ధంతి సందర్భంగా సీపీఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం వనపర్తి జిల్లా కేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి ఎండీ జబ్బార్, పలువురు నాయకులు మాట్లాడుతూ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో పాల్గొన్న మహావ్యక్తి అని, ప్రజా సమస్యలు అసెంబ్లీ, పార్లమెంట్‌లో పలు అంశాలపై చర్చించి ప్రజలకు ఉపయోగపడే చట్టాలను తీసుకొచ్చేందుకు ప్రయత్నం చేశారని కొనియాడారు. ప్రజాశక్తి సంపాదకులుగా ఉంటూ రైతు, కార్మికుల సమస్యలపై ప్రభుత్వాలను నిలదీస్తూ సంపాదకీయం రాసేవారని, వారి స్ఫూర్తితో రానున్న రోజుల్లో సీపీఎం విస్తరణకు కృషి చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు బాల్‌రెడ్డి, ఉమ, సాయిలీల, బాలపీరు, పురుషోత్తం, సుగుణమ్మ తదితరులు పాల్గొన్నారు.

రంగసముద్రంలో కొండచిలువ పట్టివేత



కొండచిలువతో సాగర్ స్నేక్ సొసైటీ సభ్యులు

పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండల కేంద్రంలోని రంగసముద్రంలో చేపలు బయటికి వెళ్లకుండా వలను అడ్డం కట్టారు. ఆ వలలో కొండచిలువ చిక్కుకుంది. గుర్తించిన మత్స్యకారులు జిల్లా సాగర్ స్నేక్ సొసైటీ అధ్యక్షుడు కృష్ణసాగర్‌కు సమాచారం ఇచ్చారు. అతడు ఫారెస్టు అధికారి రాణికి సమాచారం ఇచ్చి, వారి బృందంతో శ్రీరంగాపురంలోని రంగసముద్రం వద్దకు చేరుకొని వలలో చిక్కుకున్న 8 అడుగుల కొండచిలువ కాపాడారు. వనపర్తి డీఎఫ్‌ఓ నవీన్‌కుమార్‌రెడ్డి ఆదేశానుసారం కొండచిలువను అడవి ప్రాంతంలో వదిలిపెట్టారు. కార్యక్రమంలో చిలుకకుమార్, గోపాల్‌యాదవ్, నవీన్, బ్రహ్మం, మత్స్యకారులు పాల్గొన్నారు.

అనువుగా ఉండే వీల్‌చైర్ అందించండి



పాన్‌గల్: అనువుగా ఉండే వీల్ చైర్ అందించాల్సిన అధికారులు.. అవసరానికి పనికిరాని వీల్‌చైర్ అందించారని దివ్యాంగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ‘వీల్ చైర్ అందించండి మహాప్రభో’ అంటూ సాక్షి దినపత్రికలో గత నెల 21న వచ్చిన కథనానికి స్పందించిన అధికారులు సోమవారం మండలంలోని తెల్లరాళ్లపల్లితండాకు చెందిన నడవలేని స్థితిలో ఉన్న దివ్యాంగులు గుండూనాయక్, శాంతమ్మకు వీల్‌చైర్ అందించారు. కానీ ఇవి తమ అవసరాలకు అనుగుణంగా లేవని దివ్యాంగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తూతూ మంత్రంగా ఏదో ఒక వీల్‌చైర్ అందించి అధికారులు చేతులు దులుపుకున్నారని దివ్యాంగులు వాపోతున్నారు. ఇచ్చిన వీల్‌చైర్ వేరొకరి సాయం ఉంటేనే ముందుకు కదులుతుందని, ఎవరూ లేని సమయంలో తమ పరిస్థితి ఏంటని ఆవేదన వ్యక్తం చేశారు. చేతుల సాయంతో ముందుకు కదిలే విధంగా ఉండే వీల్‌చైర్‌ను అందిస్తే ఉపయోగం ఉంటుందని వారు పేర్కొన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఉపయోగకరంగా ఉండే వీల్‌చైర్‌ను అందించాలని దివ్యాంగులు కోరుతున్నారు.

రేపు చెన్నకేశవస్వామి కల్యాణోత్సవం

కోడేరు: మండలంలోని రాజాపూర్‌లో శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవ స్వామి 7వ వార్షికోత్సవం సందర్భంగా గురువారం స్వామి వారి కల్యాణ మహోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. అర్చకులు భాస్కరశర్మ ఆధ్వర్యంలో రిటైర్డ్ తహసీల్దార్ బాలస్వామి, శారద దంపతులు స్వా మి వారికి నూతన ఆభరణాల అలంకరణ, కల్యాణమహోత్సవం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

క్షయ నివారణపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

పాన్‌గల్: మండలంలోని రేమద్దులలో క్షయ వ్యాధి నివారణపై వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది మాట్లాడుతూ రెండు వారాలకు మించి దగ్గు, రాత్రి వేళల్లో జ్వరం, స్వల్ప కాలంలో బరువు తగ్గడం, రాత్రి వేళల్లో చెమటలు పట్టడం వంటి లక్షణాలు ఉన్న వారు పీహెచ్‌సీలో వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. వ్యాధి నిర్ధారణ అయితే క్రమం తప్పకుండా మందులు వాడితే రోగం నయమవుతుందన్నారు. సర్వే చేసి అనుమానితుల నుంచి తెమడ పరీక్షల నిమిత్తం శ్లేష్మాను సేకరించినట్లు వారు పేర్కొన్నారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వర్షాకాలంలో కాలనీల్లో వర్షపు, మురుగు నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని కోరారు. నీటి నిల్వలతో దోమలు వృద్ధి చెంది మలేరియా, డెంగీ, చికెన్ గున్యా, బోదకాలు, మెదడువాపు వంటి రోగాలు సంభవిస్తాయన్నారు. ఈనెల 20న పంపిణీ చేసే నులి పురుగుల నివారణ మాత్రల పంపిణీ ఉంటుందని, ప్రతి విద్యార్థి ఉదయం వేళ అల్పాహారం తప్పకతిని రావాలని సూచించారు. అల్పాహారం తినకుండా వచ్చిన విద్యార్థులకు నివారణ మాత్రలు వేయకూడదని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది రాంచందర్, శాంతమ్మ, ఆశా కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం



వనపర్తిలో మృతదేహానికి నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

వనపర్తి టౌన్: జిల్లా కేంద్రంలోని 8వ వార్డుకు చెందిన జక్కుల మన్నెంకొండ మృతి చెందిన విషయాన్ని స్థానిక కౌన్సిలర్ విభూతి నారాయణ ఎమ్మెల్యే మేఘారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు జెడ్పీటీసీ మాజీ సభ్యుడు వెంకటయ్యయాదవ్ మంగళవారం మన్నెంకొండ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ధైర్యంగా ఉండాలని బాధిత కుటుంబ సభ్యులకు భరోసా కల్పించారు. దహన సంస్కారాలకు ఎమ్మెల్యే అందించిన రూ.5వేల ఆర్థికసాయాన్ని బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో శివ, ఉమ్మల రాములు, బాలస్వామి, వెల్డింగ్ నరసింహ, శాంతన్న, రాములు, రమేష్, సురేష్ ఉన్నారు.

పెబ్బేరు రూరల్: వనపర్తి మండలంలోని శ్రీనివాసపురం గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్త జక్కుల మన్యంయాదవ్, మర్రికుంట 9 వార్డులోని చీర్ల బుచ్చన్న అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి స్థానిక నాయకులతో కలిసి మంగళవారం మృతదేహాలకు పూలమాలు వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో మండల బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు మాణిక్యం, దేవర్ల, నరసింహ, మాధవరెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, నరేష్, సంపత్‌కుమార్‌రెడ్డి, రాము, బాబునాయక్, మురళి సాగర్ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

బిజినేపల్లి: రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తున్న వాహనాన్ని మంగళవారం అధికారులు పట్టుకున్నారు. స్థానికులు వివరాల ప్రకారం మండలంలోని మంగనూరు నుంచి దాదాపుగా 4 క్వింటాళ్ల రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తుండగా సమాచారం మేరకు పౌర సరఫరాల డీటీ రామ్మోహన్ తనిఖీ చేపట్టారు. వాహనంలో రేషన్‌బియ్యం గుర్తించి పోలీసులకు అప్పగించారు. గ్రామానికి చెందిన పోషన్న, నందివడ్డెమాన్‌కు చెందిన బాలుపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ సయ్యద్ అలీ తెలిపారు.